క్లుప్తంగా

రేపు దుర్గమ్మ హుండీ కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 19వ తేదీన లెక్కించనున్నారు. 19వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు మహా మండపంలోని ఆరో అంతస్తులో కానుకల లెక్కింపు ప్రారంభమవుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

జూపూడిని కలిసిన వైఎస్సార్ సీపీ దళిత నేతలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర రావును సోమవారం ఆ పార్టీకి చెందిన దళిత నేతలు కలిశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆయన నివాసానికి వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు, రాష్ట్ర నాయకుడు దాసి జయప్రకాష్, కెనడి తదితరులు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పం ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దళిత వర్గాలకు చేసిన మేలును వివరిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేవరకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

చెస్ టోర్నీ విజేతలకు బహుమతులు


విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రా లయోల కాలేజీలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ విన్నర్ ట్రోఫీని కె.భావన్, రన్నర్ ట్రోఫీని జె.మల్లేశ్వరరావు అందుకున్నారు. వైఈఎస్–జె ఆధ్వర్యంలో మ్యాజిక్ యూత్ నిర్వహించిన పోటీలు రసవత్తరంగా సాగాయి. టోర్నీలో మూడో స్థానాన్ని ఎం.బాబుశామ్యూల్ సాధించాడు. కాలేజీ ఆవరణలో సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఉమెన్ గ్రాండ్ మాస్టర్ నూతక్కి ప్రియాంక విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర లయోల సంస్థల రెక్టర్ ఫాదర్ పి.ఆర్.జాన్, వైఈఎస్–జె వ్యవస్థాపకులు ఫాదర్ బాల బొల్లినేని, మ్యాజిక్ యూత్ ప్రతినిధులు ఎం.మణిరాజు, పి.నదియా, వి.లోకేష్, ఎ.ప్రేమ్‌కుమార్, సి.హర్షిత, ఎ.అఖిల పాల్గొన్నారు.

షేక్ రాజా సాహెబ్ హాస్పిటల్లో ల్యాబ్ ప్రారంభం



వించిపేట(విజయవాడపశ్చిమ): జైన్ సమాజ్ సహకారంతో కొత్తపేటలోని షేక్ రాజాసాహెబ్ జనరల్ హాస్పిటల్‌లో రూ.12 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ను సోమవారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతి కిరణ్, వైద్యులు తనూజ, బిందు, సిబ్బంది, జైన్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

సొరంగం, కొండ ప్రాంతంలో సీపీఐ బృందం పర్యటన



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సొరంగంలో జరుగుతున్న ప్రమాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని, కార్పొరేషన్ అధికారులను డిమాండ్ చేశారు. సీపీఐకి చెందిన పలువురు నేతలు సోమవారం చిట్టినగర్ సొరంగం, కొండ ప్రాంతంలో పర్యటించారు. వన్‌టౌన్, గట్టు వెనుక ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న సొరంగంలో కొంత కాలంగా నీరు లీకవుతోందని, ఆ లీకు తీవ్రత పెరిగి రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అయితే కార్పొరేషన్ అధికారులు సొరంగంలో లీకేజీల నివారణకు తాత్కాలిక పనులు చేపట్టారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కొండపై నివాసం ఉండే ప్రజలకు ఇల్లు, నష్టపరిహారం ఇచ్చి తరలించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. పర్యటనలో సీపీఐ నగర నాయకులు డీవీ రమణబాబు, కె.వెంకటేశ్వరరావు, ఆర్.మైఖేల్, ఎస్వీ రమణ, చింతాడ పార్వతి, చీర్ల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

- గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు ఆవాసంగా పార్కులు
- చెత్తాచెదారంతో అధ్వానంగా నిర్వహణ



టీచర్స్ కాలనీలోని ఒక పార్క్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకర వాతావరణంలో కాసేపు కూర్చోవడం లేదా వాకింగ్ చేయడం కోసం నగరపాలక సంస్థ ఏర్పాటు చేస్తున్న పార్కుల నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. భవానీపురం టీచర్స్ కాలనీ శివాలయం రోడ్‌లో నగరపాలక సంస్థకు చెందిన రెండు పార్కులు (ఎదురెదురుగా) అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారటమే అందుకు నిదర్శనం. పట్టించుకునే వారు లేకపోవడంతో పార్క్‌లో ఉన్న చెట్ల ఆకులతో పాటు చెత్తాచెదారంతో అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు ఆవాసాలుగా మారాయి. ఎక్కడెక్కడ నుంచో కొంతమంది యువకులు రాత్రి వేళల్లో వచ్చి పార్క్ పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోని వారు ఏర్పాటు చేసిన లైట్లను బయట నుంచి ఎవరికీ కనబడకుండా ఉండేందుకు పగులకొడుతున్నారు. పార్క్ చివరిగా గుబురు చెట్ల నడుమ ఉన్న బెంచి మీద కూర్చుని చీకటిమాటున గంజాయి తాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వారిలో బ్లేడ్ బ్యాచ్‌కూడా ఉందన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఇక్కడ మీకేం పని, వెళ్లిపోండని మందలిస్తే ఎదురుదాడి చేస్తున్నారని వాపోతున్నారు. ఒక పార్క్ గేట్‌కు అనుసంధానంగా ఉన్న గోడ పగిలిపోయి ఇనుప గేట్ ఊడిపోయేలా ఉంది. రెండవ పార్క్ నిరుపయోగంగా ఉండటంతో కొంతమంది యువకులు ఉదయం పూట షటిల్, బ్యాడ్మింటన్ ఆడుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో టీచర్స్ కాలనీకి చెందిన పలువురు మహిళలు, వృద్ధులు దూరంగా ఉన్న హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని పార్క్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పార్క్ ఎదుటే నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఒక ఉన్నత అధికారి నివసిస్తుండటం గమనార్హం.

వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ పరికరాలతో అభివృద్ధి చేయండి

నిరుపయోగంగా ఉన్న రెండు పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని కాలనీవాసులు నగరపాలక సంస్థ ఉద్యానవన శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రెండు పార్కుల పరిసరాలలో దాదాపు ఐదు వేల మంది నివసిస్తున్నారు. తమకు దగ్గరలో ఉన్న పార్కులు అందుబాటులో లేకపోవడంతో ఇతర పార్కులకు వెళ్లాల్సి వస్తోందని మహిళలు చెబుతున్నారు. అక్కడ కొంత సేపు గడిపిన తరువాత చీకటిలో తిరిగి ఇళ్లకు చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు. అసలే చైన్ స్నాచింగ్‌లు జరుగుతున్న తరుణంలో భయం వేస్తుందని చెప్పారు. జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ పార్కులను అభివృద్ధి చేస్తామంటూ ఉద్యాన శాఖ అధికారులు వచ్చి కొలతలు తీసుకువెళుతున్నారు తప్ప ఆ తరువాత మళ్లీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాగున్న పార్కుల అభివృద్ధిపై దృష్టి పెడుతున్న సంబంధిత అధికారులు నిరుపయోగంగా ఉన్న పార్కులను ఎందుకు పట్టించుకోరని మండిపడుతున్నారు. ఒక పార్క్‌లో పూర్తిగా ఓపెన్ జిమ్, మరో పార్క్‌లో వాకింగ్ ట్రాక్, బెంచీలు ఏర్పాటు చేస్తే తాము ఎక్కడికో వెళ్లాల్సిన పరిస్థితి ఉండదని స్థానిక మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు.

నీటి శుద్ధతను నిరంతరం పరీక్షించండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



హిందూ శ్మశానవాటికను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, చిత్రంలో కార్పొరేటర్ రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తన నగర పర్యటనలో భాగంగా సోమవారం గట్టు వెనుక ప్రాంతం విద్యాధరపురం 38వ డివిజన్‌లో గల డాక్టర్ కేఎల్ రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్, చేపల రేవు, హిందూ శ్మశానవాటిక, కుమ్మరిపాలెం సెంటర్‌లోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీతో కలిసి పరిశీలించారు. తొలుత హెడ్ వాటర్ వర్క్స్‌లో పర్యటించి ప్రజలకు అందించే రక్షిత మంచినీటి శుద్ధతను నిరంతరం పరీక్షించి తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

తాగునీటి సరఫరా చేసే పైపులు డ్రెయిన్ క్రాసింగ్‌లలో లేకుండా సచివాలయ సిబ్బంది, అసిస్టెంట్ ఇంజినీర్లు ప్రతి రోజు పర్యవేక్షిస్తుండాలని ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా వాటర్ రిజర్వాయర్లు, ట్యాంకులను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలని చెప్పారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు.

గ్యాస్ క్రిమిటోరియం పని చేయకపోవడంపై ఆగ్రహం

డివిజన్ పరిధిలోని హిందూ శ్మశాన వాటికలో గ్యాస్ ఆధారిత క్రిమిటోరియంను కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. అది పని చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శ్మశాన వాటికకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని, శ్మశాన వాటిక లోపల మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కుమ్మరిపాలెం సెంటర్‌లో ప్రస్తుతం ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని పరిశీలించారు. దానిని ఆధునీకరించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఒక ప్రణాళికను తయారు చేసి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకట నారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు హయత్ షరీఫ్, శానిటరీ సూపర్‌వైజర్ కె.శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి మృతికి వెలంపల్లి నివాళి



పిచ్చమ్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, ఉమ్మడి కృష్ణాజిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతదేహానికి ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం నివాళులర్పించారు. ఆమె మరణ వార్త తెలియగానే వెలంపల్లి శ్రీనివాసరావు హుటాహుటిన ఒంగోలు పయనమై వెళ్లారు. ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెలంపల్లితో పాటుగా దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఎస్సీ సెల్ నేత బూదాల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మహేష్ సంతాపం

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ మృతికి ఆ పార్టీ నేత పోతిన మహేష్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలంటూ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

హస్తకళల కళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రామీణ హస్త కళాకారులతో తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగు పరచనున్నట్లు నాబార్డ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. నాబార్డు ఆర్థికసాయంతో పీవీపీ మాల్‌లో ఏర్పాటు చేసిన హస్త కళా ఉత్పత్తుల అమ్మకాల ముగింపు కార్యక్రమంలో కేవీఎస్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాబార్డు ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, యువతకు హస్తకళా ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేస్తం సంస్థ సీఈఓ వి సురేష్, నాబార్డు ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, నేస్తం డైరెక్టర్ నందినితదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌లో మందుబాబుల వీరంగం

బీర్ బాటిల్స్‌తో తలపై కొట్టుకున్న వైనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనుమతి లేకుండా వైన్స్‌లో ఏర్పాటు చేసిన షెడ్డులో మందుబాబులు వీరంగం సృష్టించారు. బీరు బాటిల్స్‌తో తలపై కొట్టుకుని అందరినీ భయాందోళనలకు గురి చేశారు. సేకరించిన వివరాల ప్రకారం కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పైపుల రోడ్డు సమీపంలో సుందరయ్య కట్ట వద్ద వైన్స్ షాపు నడుపుతున్నారు. అయితే వైన్ షాపు వెనుక భాగంలో మందుబాబులు కూర్చుని మందు తాగేందుకు నిర్వాహకులు షెడ్డు ఏర్పాటు చేశారు. పాయకాపురం రాధానగర్‌కు చెందిన ముగ్గురు యువకులు వైన్ షాపులో మద్యం, బీర్లు కొనుగోలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాపు వెనుక ఏర్పాటు చేసిన షెడ్డులో కూర్చుని బీర్లు, మద్యం తాగసాగారు. మద్యం తాగే క్రమంలో ముగ్గురి మధ్య చోటు చేసుకున్న వివాదం తారస్థాయికి చేరింది. ఒకరినొకరు నెట్టుకోవడమే కాకుండా తాగిన బీర్ బాటిల్‌ను తీసుకుని ఒకడు తన తలపై కొట్టుకున్నాడు. ఇంతలో పక్కనే ఉన్న మరో బీర్ బాటిల్‌ను అందుకోవడంతో అక్కడే కూర్చుని మద్యం తాగుతున్న మరి కొందరు భయంతో షెడ్డులో నుంచి బయటకు పరుగులు తీశారు. కొంత సమయం తర్వాత బీర్ బాటిల్‌తో తలపై కొట్టుకున్న యువకుడు మరి కొంతమంది యువకులను తీసుకుని వైన్స్ వద్దకు చేరుకున్నాడు. అయితే వచ్చిన వారి చేతుల్లో కర్రలు ఉండటంతో అక్కడి పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. అప్పటికే మద్యం తాగిన ఇద్దరు యువకులు అక్కడి నుంచి వెళ్లిపోగా, కర్రలు తీసుకుని వచ్చిన వారు రోడ్డుపై నానా యాగీ చేస్తుండటంతో స్థానికంగా నివాసం ఉన్న వారు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. అయితే గొడవ జరిగిన చాలా సమయం తర్వాత కొత్తపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొంతకాలంగా ఈ వైన్స్ షాపు వద్ద రోజూ ఇదే రీతిలో గొడవలు జరుగుతున్నాయని, పోలీసులకు సమాచారం ఇస్తే వారు వచ్చేలోగానే గొడవ చేసిన వారు వెళ్లిపోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అనుమతి లేకుండా వైన్స్ షాపుల వద్ద ఏర్పాటు చేసిన షెడ్డును తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వైన్స్ షాపు వద్దే కాకుండా చుట్టుపక్కల ఇళ్ల అరుగులపైన, మెట్లపై కూడా కూర్చుని మద్యం తాగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

వినండి.. పరిష్కరించండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలను అధికారులు విని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో నగరవాసుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజల ఫిర్యాదులను వీఎంసీ శాఖాధికారులు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, సమస్య ప్రాధాన్యం మేరు వెంటనే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా వినడం, వాటికి తక్షణ పరిష్కారం కల్పించడం ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. పురపాలక సేవలు, రోడ్లు, మంచినీరు, మురుగు కాలువలు, గృహ పథకాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అప్పగించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 31 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొఖావల్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

- నియోజకవర్గంలో 19 పరీక్ష కేంద్రాలు
- కేంద్రాల వద్ద తల్లిదండ్రుల పడిగాపులు



విజయవాడ వన్‌టౌన్ సుందరరామయ్య ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల హడావుడి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ విద్యాసంస్థల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారు. ప్రధానంగా నియోజకవర్గంలో 19 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో తొలి రోజు ప్రశాంతంగా పరీక్షను రాశారు. ఉదయం 8.45 గంటలకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించి ఆయా కేంద్రాల వద్ద సిబ్బంది వారిని లోపలకు అనుమతించారు. నోటీసు బోర్డుల్లో గదుల కేటాయింపులను పరిశీలించి తమకు కేటాయించిన పరీక్ష గదుల్లోకి విద్యార్థులు చేరుకున్నారు.

సందడిగా నియోజకవర్గ విద్యాసంస్థలు

పశ్చిమ నియోజకవర్గంలో కేటాయించిన 19 పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సందడి నెలకొంది. పాతబస్తీలోని ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్, గాంధీజీ హైస్కూల్, పాదర్తి సుందరమ్మ హైస్కూల్, తేలప్రోలు బాపనయ్య హైస్కూల్, రాయల్ హోటల్ సెంటర్‌లోని మౌలానా ఆజాద్ హైస్కూల్, కొత్తపేట తేలప్రోలు రాజా హైస్కూల్‌తో పాటుగా విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య హైస్కూల్ పరిసర ప్రాంతాలన్నీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కళకళలాడాయి. ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్ష కేంద్రంలోకి పంపించి, పరీక్ష పూర్తయ్యేవరకు అదే ప్రాంతాల్లో తిరుగుతూ కాలక్షేపం చేశారు. అనంతరం మధ్యాహ్నం పరీక్ష ముగిసిన తరువాత వారి పిల్లలను తీసుకుని వెళ్లారు.



కుమారుడిని ఆశీర్వదించి పంపుతున్న ఓ మాతృమూర్తి



పదో తరగతి పరీక్ష కేంద్రం లోపలికి వెళ్తున్న విద్యార్థులు



నోటీసు బోర్డులో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రం బయట ఆటోలో కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు నిరుపమానం



పారిశుద్ధ్య కార్మికులకు చీరెలు పంపిణీ చేస్తున్న శేషగిరిరావు, నారిండి కిషోర్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు నిరుపమానమని లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ గెలాక్సీ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు కొనియాడారు. ఆయన అధికార పర్యటన సందర్భంగా విద్యాధరపురం చెరువు సెంటర్‌లో క్లబ్ నిర్వహించిన సేవా మహోత్సవం కార్యక్రమంలో 44వ డివిజన్ పరిధిలోని సుమారు 40 మంది పారిశుద్ధ్య కార్మికులకు, మహిళలకు చీరెలు, పురుషులకు టవల్స్ పంపిణీ చేశారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ కోవిడ్, బుడమేరు వరదలు వంటి విపత్తులలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా నిలిచి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ఆరోగ్యం కోసం పని చేసిన పారిశుద్ధ్య కార్మికుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ గెలాక్సీ అధ్యక్ష, కార్యదర్శులు గుండా రమేష్, నారిండి కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగంలో పని చేస్తున్నవారు తమ ఆరోగ్యం గురించి కాకుండా ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుని పని చేస్తుండటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీ బండి జ్యోతి, జెడ్పీటీసీ చెన్నారెడ్డి, సభ్యులు నీలిశెట్టి చెన్నకేశవులు, చేబ్రోలు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను ఆకట్టుకునే 'కాలగమనం'

చిత్ర హీరో రాజా



కాలగమనం చిత్రం ట్రైలర్ రిలీజ్‌లో చిత్ర యూనిట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గ్రామీణ నేపథ్యంలో తీసిన కాలగమనం చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్రం హీరో రాజా, హీరోయిన్ లావణ్యరామారావు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం దర్శకుడు, నిర్మాత బుర్రి సుధాకర్ నిర్మించిన కాలగమనం సినిమా ట్రైలర్ లాంచ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా, లావణ్య మాట్లాడుతూ ప్రేమ, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు ఉన్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు కుటుంబ సమేతంగా వీక్షించవచ్చన్నారు. దర్శకుడు బుర్రి సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో తీసిన బలగం చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రేక్షకులందరికీ తెలుసని, అదే రీతిలో ఈ చిత్రాన్ని కూడా నిర్మించామన్నారు. వచ్చే నెలలో థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. తొలుత ఈ సినిమాకు సంబంధించిన ఒక పాటను ఆవిష్కరించి హీరో హీరోయిన్‌లు స్టెప్పులు వేసి అందర్నీ అలరించారు. జబర్దస్త్ టీమ్ సభ్యులు తమదైన పంచ్ డైలాగులతో సందడి చేశారు. ముఖ్య అతిథులు ఏపీ ఫిల్మ్ చాంబర్ మాజీ అధ్యక్షుడు మధుమోహన్, వేగ జ్యూవెలరీ అధినేత వనమా సుధాకర్, కాపా శ్రీనివాసరావు చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మిగిలిపోయిన తరుణంలో కొన్ని ఆస్పత్రులు, స్వచ్ఛంద సేవా సంస్థల వారు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ కోరారు. భవానీపురం మసీదు రోడ్‌లోని రజా మసీదు ప్రాంగణంలోని తన కార్యాలయం వద్ద అయాన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. హాస్పిటల్ చీఫ్ డాక్టర్ బషీర్ అహ్మద్ తన వైద్య బృందంతో వచ్చి 148 మందికి కళ్ల పరీక్షలు చేసి ఇర్ఫాన్ చేతుల మీదుగా ఉచితంగా మందులు అందజేశారు. హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరం ముస్లిం మైనార్టీలకు రంజాన్ మాస కానుకగా భావిస్తున్నామని కార్పొరేటర్ ఇర్ఫాన్ అన్నారు.